

# బీజేపీ ప్రభుత్వ అసమర్థతతోనే నీట్ ప్రశ్నాపత్రం లీక్

- విద్యార్థుల తల్లిదండ్రులకు కేంద్రం క్షమాపణ చెప్పాలి
- మోదీ మూడోసారి ప్రధాని అయ్యాక పూర్తిగా వైఫల్యం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ చట్టానికి సహకరించాలి
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ డిమాండ్

**ప్రజానావ, సిరిసిల్ల :** నీట్ ప్రశ్నాపత్రం లీకై ఏకంగా పరీక్షనే రద్దు చేయాల్సిన దుస్థితి రావడం కేంద్ర ప్రభుత్వానికి సిగ్గుచేటని, బీజేపీ కేంద్ర ప్రభుత్వం అసమర్థత కారణంగా ప్రశ్న పత్రం లీకేజీ అయ్యిందని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం కేంద్రంలో ఆది శ్రీనివాస్ మీడియా సమావేశం నిర్వహించారు. బావి భారత వైద్య అధికారులు కావాలనుకున్న విద్యార్థుల కలలను కేంద్ర ప్రభుత్వం చిదిమివేసిందన్నారు. కష్టపడి చదివిన ఎంతోమంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం ఆటలు ఆడుతుందని, పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడం చేతకాని కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే మరోసారి పేపర్ లీకైందని ఆరోపించారు. ఈ నెల 3 న రాజస్థాన్ లో పేపర్ లీక్ కావడంతో పరీక్ష రద్దు కావడం వల్ల విద్యార్థులు తీవ్ర విచారణ వ్యక్తం చేస్తున్నారని, ఏకంగా ప్రశ్న పత్రం పరీక్షకు ముందు రోజే లీక్ కావడం వ్యవస్థలో ఉన్న దారుణమైన లోపాలను బయటపెట్టిందని వెల్లడించారు. దేశవ్యాప్తంగా నీట్ పరీక్ష రాసిన దాదాపు 23 లక్షల మంది విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా 71 వేల మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులను కేంద్ర ప్రభుత్వం తీవ్ర మానసిక క్షోభకు గురిచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పేపర్ లీకేజీకి పూర్తి బాధ్యత వహించి కేంద్ర ప్రభుత్వం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో రాష్ట్రంలో గ్రూప్ 1 పేపర్ లీక్ కావడం వారి వైఫల్యానికి నిదర్శనమని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నోటిఫికేషన్ ఇచ్చిన దాఖలలు లేవు, ఒకవేళ ఇస్తే పరీక్షలకు ముందే లీకేజీల పర్వం కొనసాగిందన్నారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వనికి పకడ్బదిశీగా పరీక్షలు నిర్వహించాలని సోయి కూడా లేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో సుమారు 70 వేల ఉద్యోగాల నియామకం చేపడితే ఒక్క పేపర్ కూడా లీక్ కాలేదని, ఆది మా ప్రభుత్వ సమర్థతకు నిదర్శనం అని పేర్కొన్నారు. మోదీ మూడవ సారి ప్రధాని అయ్యాక పూర్తిగా వైఫల్యం చెందుతున్నారని, మొన్నటి సభలో మోదీ బంగారం కొనద్దు వంటి రకరకాల ఆంక్షలు పెడుతున్నారు.. ఈ ఆంక్షలు వారి చేతకాని తనానికి నిదర్శనం అని అన్నారు. కేంద్రంలో రాహుల్ గాంధీ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా పాలన వస్తుందని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని, కేంద్ర మంత్రి బండి సంజయ్ చట్టానికి సహకరించాలని, విచారణకు సహకరిస్తే జరిగిన తప్పు ఒప్పులు తెలుస్తాయని, కానీ భావోద్వేగంతో ప్రసంగాలు చేయడం కాదన్నారు. తన కొడుకు తప్పు చేస్తే శిక్షించాలని వార అంటున్నారు. చట్టానికి అప్ప చెప్పినప్పుడు చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# పిల్లలు లేని వారికి దత్తత ఒక వరం

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- చిన్నారుల దత్తత కార్యక్రమం



**ప్రజానావ, సిరిసిల్ల :** పిల్లలు లేని వారికి దత్తత ఒక వరం లాంటిదని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఇద్దరు చిన్నారులను దత్తతకు అందించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. పిల్లలను చక్కగా చూసుకోవాలని చెప్పారు. ఎవరైనా చట్టబద్ధంగా సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ ద్వారా మాత్రమే ఆన్లైన్ ద్వారా పిల్లలను దత్తతకు ఎంపిక చేసుకోవాలని సూచించారు. అలాకాకుండా ఇతర అక్రమ మార్గాలలో చేసుకున్నట్లయితే ఐదు సంవత్సరాల జైలు శిక్ష లక్ష రూపాయల జరిమానా ఉంటుందని హెచ్చరించారు. పిల్లలను పెంచే స్థోమత లేనటువంటి తల్లితండ్రులు తమ పిల్లల్ని దత్తత కోసం అప్పగించవచ్చని జిల్లా కలెక్టర్ సూచించారు. పిల్లలను రోడ్డు మీద వదిలి వేస్తున్న వారి తల్లిదండ్రులపైన జువైనల్ జస్టిస్ చట్టం ప్రకారము చర్య తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలను నిర్లక్ష్యం చేసినా, వదిలివేయడానికి ప్రోత్సహించిన వారికి కూడా చట్ట ప్రకారం జైలు శిక్ష జరిమానా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం దత్తత కోసం చాలామంది ఎదురుచూస్తున్నారని, ఎవరికైనా పిల్లలు పెంచే శక్తి లేనట్లయితే, అవాంచిత గర్భం అయినప్పుడు, వద్దు అనుకున్నట్లయితే పిల్లలని ప్రభుత్వ శిశు సంరక్షణ కేంద్రాలకు అప్పగించాలని, వారిని చట్ట ప్రకారం దత్తతకు పంపిస్తామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు పిల్లల సంరక్షణ గురించి, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సూచనలు అందించారు. దీంతో ఆ పిల్లలకు మంచి జీవితాన్ని, వెలుగులు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా బాలల ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎన్ఐసీ ఎం గగన్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల సేవలను వినియోగించుకోవాలి

### మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి

**ప్రజానావ, సిరిసిల్ల :** ప్రజలు వారి పిల్లల చదువుల కోసం ప్రభుత్వ పాఠశాలల సేవలను వినియోగించుకోవాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి పిలుపునిచ్చారు. బుధవారం సిరిసిల్ల పట్టణంలో నిర్వహించిన విద్యా వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధుల కార్యాశాల (ట్రైనింగ్ ప్రోగ్రామ్) లో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు నాగుల సత్యనారాయణ గౌడ్, ఆర్డీవో వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈనెల 11 నుండి 17 వ తేదీ వరకు నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలలో భాగంగా నేడు



నియోజకవర్గస్థాయి గ్రామ సర్పంచులకు, మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించడం స్వాగతిస్తున్నామని అన్నారు. ప్రజా ప్రతినిధులుగా మేమందరం కూడ ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చదువుకునేలా ప్రోత్సహిస్తామని, అందుకు ప్రభుత్వం చేపట్టే ఏ కార్యక్రమం అయినా విజయవంతం చేయడంలో ముందుంటామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మాధ్యమంలో విద్యాబోధనను ప్రతిభావంతులైన నైపుణ్యం గల ఉపాధ్యాయులచే చేపడుతున్నారన్నారు. మొన్నటి పదవ తరగతి పరీక్షల్లో ప్రైవేటు పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించిన విషయం మనందరికీ తెలిసిందేనని ఉన్నారు. ప్రజలు వారి పిల్లల చదువుకై ప్రభుత్వ పాఠశాలల యొక్క సేవలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ సభ్యులు, ఏఎంసి చైర్మన్లు, నియోజకవర్గ పరిధిలోని మండల విద్యాశాఖ అధికారులు, సర్పంచులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్య

**ప్రజానావ, మెదక్:** మెదక్ జిల్లా శివంపేట మండలం శభాష్‌పల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని ఓ వ్యక్తిని హత్య చేసి పడేయడంతో స్థానికంగా కలకలం రేగింది. బుధవారం ఉదయం అటుగా వెళ్లిన పలువురు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తూప్రాన్ సీఐ వెంకట రాజా గౌడ్, స్థానిక ఎస్ఐ మధుకర్ రెడ్డి అక్కడికి చేరుకొని పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ ఘట్‌కేసర్ మండలం అంకుశాపూర్ గ్రామానికి చెందిన ఎండీ అన్వర్ (50) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్టు గుర్తించారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అతడిని హత్య చేసి శభాష్‌పల్లి గ్రామ శివారులో పడేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



# అక్రమ పశువుల రవాణాపై ప్రత్యేక నిఘా

### బక్రీద్ సందర్భంగా సరిహద్దుల్లో విస్తృత తనిఖీలు

### ఎస్పీ మహేష్ బి. గితే ఆకస్మిక తనిఖీ

**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం జిల్లెళ్ల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను బుధవారం రాత్రి జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆకస్మికంగా తనిఖీ చేసి వాహనాల తనిఖీలను స్వయంగా పరిశీలించారు. అనంతరం చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది 24/7 అప్రమత్తంగా ఉంటూ ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమ పశువుల రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. రానున్న బక్రీద్ పండుగ నేపథ్యంలో జిల్లాలో మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విస్తృత స్థాయిలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్పీ తెలిపారు. గోవులు, దూడలను నిబంధనలకు విరుద్ధంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పశువైద్యుల ధ్రువీకరణ పత్రాలు లేకుండా జంతువులను రవాణా చేస్తే సంబంధిత వాహనాలను జప్తు చేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అక్రమ పశువుల రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా పోలీస్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకుండా, నిందితులపై ప్రత్యక్ష దాడులకు పాల్పడకూడదని హెచ్చరించారు. గోవధ నివారణ, అక్రమ పశువుల రవాణా అరికట్టేందుకు పోలీస్ శాఖ మరియు పశుసంవర్ధక శాఖ సంయుక్త బృందాలు 24/7 ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నాయని ఎస్పీ తెలిపారు. ఎస్పీ వెంట డీఎస్పీ నాగేంద్రచారి, ఎస్ఐ ఉపేంద్ర చారి, సిబ్బంది ఉన్నారు.

# వేములవాడలో గంజాయి విక్రేతల అరెస్ట్

### ఇద్దరు నిందితులపై కేసు నమోదు

### శ్రీనగర్ కాలనీలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

### 60 గ్రాముల గంజాయి స్వాధీనం.. ఎన్డీపీఎస్ చట్టం కింద అరెస్ట్

**ప్రజానావ, వేములవాడ:** రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనలో భాగంగా చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్‌లో ఇద్దరు గంజాయి విక్రేతలను వేములవాడ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వేములవాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ బీ వీర ప్రసాద్ ఆదేశాల మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ బీ రామ్మోహన్ తన సిబ్బందితో కలిసి శ్రీనగర్ కాలనీలో నిర్వహించిన తనిఖీల్లో ఈ అక్రమ విక్రయాలు వెలుగుచూశాయి. శ్రీనగర్ కాలనీకి చెందిన చెట్టిపల్లి కల్యాణి(34) తన నివాసంలో గంజాయి నిల్వ ఉంచి విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆమె వద్ద నుంచి సుమారు రూ. 3,000 విలువైన 60 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో సిరిసిల్లకు చెందిన దేవేందర్ వద్ద ఈ గంజాయిని కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లు ఆమె ఒప్పుకోవడంతో, పోలీసులు వీరిద్దరినీ నిందితులుగా చేర్చి ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ ఆపరేషన్‌లో డబ్ల్యూహెచ్‌సీ లత, పీసీలు పంతులు, రమణారెడ్డి, సమీయుద్దీన్ పాల్గొన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలని ఇన్‌స్పెక్టర్ వీర ప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# బిల్లుల చెల్లింపులపై ఇందిరమ్మ లబ్ధిదారుల్లో సంతృప్తి

### జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్

**ప్రజానావ, సిరిసిల్ల :** ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు రాష్ట్రవ్యాప్తంగా బిల్లుల చెల్లింపుల్లో సంపూర్ణ సంతృప్తిలో ఉన్నారని రాజన్న సిరిసిల్ల డిసిసి అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ తెలిపారు. బుధవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట విలీన గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు, కాంగ్రెస్ కాంటెస్టెడ్ కౌన్సిలర్ సూర నిర్మలతో కలిసి నర్మెట దుర్గావ నరసయ్య, భారతి దేవయ్య నిర్మించుకున్న ఇండ్లను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు రాష్ట్రవ్యాప్తంగా బిల్లుల చెల్లింపుల్లో సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కత్తెరపాక ఎల్లయ్య, గుడిసెట్టి బాలరాజు, తడక వెంకటేశం, మ్యాన సత్యనారాయణ, అబ్బగోని లచ్చయ్య, కోలకని రాజేశం, ఆడెపు ప్రసాద్, సదుల గంగాధర్, కోలకాని ఎల్లయ్య, ఎర్ర నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



